క్లుప్తంగా

బీటీపీఎస్ రోడ్డుకు మరమ్మతులు

మణుగూరురూరల్: మణుగూరు-బీటీపీఎస్ వరకు ఉన్న గుంతలకు ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతు పనులను చేపట్టారు. ఇటీవల రహదారిపై ఏర్పడిన గుంతలపై ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి', ఇతర పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మరమ్మతు పనులకు ఆదేశించడంతో శుక్రవారం ఆర్అండ్‌బీ అధికారులు పనుల ప్రారంభించారు. ఈ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్ బృందం సందర్శించి పర్యవేక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శివసైదులు, పినపాక నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, 14టైర్స్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, తూపూడి శ్రీను, రహీంపాషా, మానుకొండ రామకృష్ణ, గోవిందు, భారత్ పాల్గొన్నారు.

వైద్యశిబిరం..

గుండాల: మండలంలోని మారుమూల గ్రామం అడవి రామవరంలో ఆళ్లపల్లి వైద్యాధికారి సంఘమిత్ర ఆధ్వర్యంలో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. గర్భిణిలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వారికి పలు ఆరోగ్య సూచనలు చేశారు. గృహాలను సందర్శించి పోషకాహారం తీసుకోవాల్సిందిగా మహిళలకు సూచించారు. సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టి.రమాదేవి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎం.నరేష్, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్ బాబు, హెల్త్ అసిస్టెంట్ ఎంఎల్‌హెచ్ పి.రేవతి, ఏఎన్ఎం సావిత్రి, ఆశ కార్యకర్త సమత, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు బ్యాగులు, వాటర్ బాటిళ్లు అందజేస్తున్న దాతలు

ములకలపల్లి: ములకలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులకు స్థానిక బీఆర్ఎస్ నాయకుడు పుష్పాల సాయి ఆధ్వర్యంలో బ్యాగులు, వాటర్ బాటిళ్లు, నోట్ పుస్తకాలు వితరణగా అందజేశారు. సాయి జన్మదినోత్సవం సందర్భంగా పీపుల్స్ హెల్పింగ్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడారు. కుటుంబసభ్యులు సభ్యులు పుష్పాల చందర్‌రావు, వెంకన్న, గ్రామపెద్దలు పువ్వాల మంగపతి, బండి కొమరయ్య. శనగపాటి సీతారాములు, కొండవీటి రాజారావు, అత్యం సాయి, అనుమల సాయి, పువ్వాల రమేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: బిల్డింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పతల నర్సింహారావు డిమాండ్ చేశారు. ములకలపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంఘ 3వ మండల మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. బిల్డింగ్ వర్కర్స్‌కు వ్యతిరేకంగాఉన్న నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘ నూతన మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షుడిగా సూరం పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి శ్రీను మరోమారు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కె.మస్తాన్, కోశాధికారిగా మోటా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా నిమ్మల మధు, సంగు శ్రీను, సహాయ కార్యదర్శులుగా కొడిమె వీరభద్రం, పాక్కిలి దానియేలు, మడివి మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 14 మంది సభ్యులతో కూడిన నూతక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విద్యార్థులకు సన్మానం

దమ్మపేట: మండల పరిధిలోని మల్కారం జెడ్పీ పాఠశాల చెందిన పలువురు విద్యార్థులను లయన్స్‌క్లబ్ సభ్యులు, గ్రామ పెద్దలు శుక్రవారం సన్మానించారు. ట్రిపుల్ ఐటీలో సెలక్ట్ అయిన అంకత మనోహరిని, గత సంవత్సరం పది ఫలితాల్లో స్కూల్ ఫస్ట్ వచ్చిన గద్దల జగదీశ్వరిని, ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిపుకు సెలక్ట్ అయిన రావుల ఠాగూర్, వంకా సంతోష్‌లను శాలువాలతో సన్మానించి, అభినందించారు. విద్యార్థులు చదువులో రాణించి.. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు ఆకిటి రవీందర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండటంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, ఈదర సత్యనారాయణ, ఎన్నా అశోక్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీల బీభత్సం

- అధిక లోడు, అధిక వేగంతో ప్రయాణం
- రోడ్లన్నీ గుంతలమయం
- భయంతో వాహనదారుల ప్రయాణం



బైరాగులపాడు దగ్గర చర్ల-భద్రాచలం ప్రధాన రహదారిపై నిలిచిన లారీలు

దుమ్ముగూడెం: మండలం మీదుగా వందలాది ఇసుక లారీలు అధిక లోడుతో వెళ్తుండడంతో ఆర్అండ్‌బీ రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఇతర వాహనాలు.. ముఖ్యంగా ద్విచక్ర వాహనాల ప్రయాణానికి తీవ్ర ఆటంకం కలుగుతోంది. అయినా పట్టించుకునే నాథుడు లేడు.

చర్ల మండలంలోని ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక లారీలు భారీ ఎత్తున మండలం మీదుగా రవాణా అవుతున్నాయి. వందలాది లారీలు సమయపాలన లేకుండా, అదీ అధిక లోడుతో ఉరుకులుబెడుతున్నాయి. అవి ప్రయాణించే వేగమూ అధికమే. ఈ నేపథ్యంలోనే రహదారులు మొత్తం గోతులమయంగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపై ప్రయాణించాలంటేనే సామాన్య ప్రజలు భయపడుతున్న పరిస్థితి ఉంది.

ఆగని లారీల పరుగులు..

ఇసుక లారీల మూలంగా మండలంలోని తూరుబాక దగ్గర గల డైవర్షన్ రహదారి గోతులమయంగా మారి ప్రజల ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. మండలంలో కురుస్తున్న వర్షాలకు డైవర్షన్ రోడ్డు చిత్తడిగా మారి గత వారం రోజుల క్రితం ఇసుక లారీ దిగబడింది. రాత్రి సమయంలో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న విషయం తెలిసిందే. కాగా దానిపై అధికారులు తూతూమంత్రంగా మరమ్మతులు చేపట్టారుగానీ.. ఇసుక లారీల రవాణాను మాత్రం నిలిపివేయలేదు. దీంతో గోతులు మరింత పెద్దవిగా మారి స్థానికుల ప్రయాణానికి ఇబ్బందిగా మారింది.

అక్కడా అంతే..

నాడు డైవర్షన్ రోడ్డుపై లారీ దిగబడి ట్రాఫిక్ జామ్ అయినప్పుడు.. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు టీఎస్ఎండీసీ అధికారులకు ఇసుక లారీల రవాణా ఈ రహదారి గుండా నిలిపివేయాలని సూచించారు. దీంతో వాటిని తాత్కాలికంగా ములకపాడు నుండి మారాయిగూడెం మీదుగా గిరిజన గ్రామాల వైపు మళ్లించారు. దీంతో ములకపాడు-మారాయిగూడెం రహదారి సైతం గోతులమయంగా మారిందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక లారీల మూలంగానే రహదారులు ధ్వంసం అవుతున్నాయనడానికి ఇది నిదర్శనం.

ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం

ఇసుక లారీలతో రోడ్లు ధ్వంసం కావడంతోపాటు గ్రామాల్లో లారీలు నిలిచి భారీ స్థాయిలో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ట్రాఫిక్ పోలీసులు ములకపాడు నుంచి వెళ్లాల్సిందిగా ఇసుక లారీలను మళ్లించడంతో అటుగా ఏదైనా జరిగితే లారీలు రోడ్డుపైనే నిలిచిపోయి ఇతర వాహనాల ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. గత మంగళవారం బైరాగులపాడు గ్రామం వద్ద ఇలాంటి సంఘటనే జరిగితే భద్రాచలం టౌన్‌లో ఆరోజు సాయంత్రం దాదాపు 350 లారీల వరకు నిలిచిపోయాయి. పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పట్టింపులేని అధికారులు

ఇసుక లారీలు మూలంగా తాము ఇబ్బందులు పడుతున్నా అధికారలు పట్టించుకోవడం లేదని, ఆ లారీలను నిలిపివేయడంతో విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైగా ఇసుక లారీలు యథేచ్ఛగా తీరగడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం అనేలా అధికారుల, పాలకుల వ్యవహరిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.

తక్షణమే నిలిపివేయాలి..



రహదారి మంచిగా లేక గోతులమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా.. ఇసుక లారీల రవాణా ఆగడం లేదు. వర్షం పడుతున్నా గోతుల నుంచి లారీలు వెలుతూ ప్రజలను భయందోళనలకు గురి చేస్తున్నాయి. తక్షణమే ఇసుక లారీలను నిలిపివేయాలి.

– కారం పుల్లయ్య, సీపీఎం మండల కార్యదర్శి

రోడ్డును దిగ్బంధిస్తాం..



వందల కొద్ది ఇసుక లారీలు గిరిజన గ్రామాల నుంచి అధిక వేగంతో వెలుతుంటే ఆందోళన కలుగుతోంది. రహదారి ఇప్పటికే గోతులమయంగా మారింది. తక్షణమే లారీలను నిలిపివేయకపోతే రోడ్డు దిగ్బంధనం చేస్తాం.

– కొర్సా నరసింహారావు, మాజీ ఉప సర్పంచ్, ఆర్లగూడెం

పీహెచ్‌సీలో తనిఖీ..



వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడుతున్న అడిషినల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సైదులు

అశ్వాపురం: అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అడిషినల్ డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ సైదులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులు పరిశీలించారు. గదులు, ఆవరణను, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారి, సిబ్బందితో మాట్లాడారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించాలని సూచించారు. పీహెచ్‌సీలో సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని, నేషనల్ హెల్త్ ప్రొగ్రాంలో అన్ని అంశాలలో వంద శాతం అచీవ్‌మెంట్ సాధించాలని ఆదేశించారు. ఈ వైద్యాధికారి డాక్టర్ సంకీర్తన, డాక్టర్ శివకుమార్, హెచ్ఈఓ లింగ్యానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం అద్దెకు.. బాధితురాలి ధర్నా

భద్రాచలంఅర్బన్: ఓ వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని అద్దెకు ఇచ్చి మోసం చేశాడంటూ ఓ మహిళ భద్రాచలంలో శుక్రవారం ధర్నా చేపట్టింది. వివరాల్లోకెళితే.. పట్టణంలోని ఏఎంఆర్ సినిమా హాల్ ఎదుట ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అడబాల శ్రీను అనే వ్యక్తి రమాదేవి అనే మహిళకు రెండేళ్లకు అగ్రిమెంట్ చేసుకుని రూ.70వేలు అడ్వాన్స్‌గా తీసుకుని నెలకు రూ.5 వేల చొప్పున అద్దెకిచ్చాడు. ఆపై విషయం తెలుసుకున్న రమాదేవి కోర్టుకి వెళ్లినప్పటికీ అది ప్రభుత్వ భూమిగా న్యాయమూర్తి నిర్ధారించారు. ఈ విషయంపై బాధితురాలు శ్రీనును గట్టిన ప్రశ్నించడంతో గురువారం కొంత మందిని తీసుకుని వచ్చి అద్దెకిచ్చిన దుకాణాన్ని చెదరకొట్టినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం ఆమె ధర్నాకు పూనుకొనగా.. అఖిలభారత యువజన సమైఖ్య జిల్లా అధ్యక్షుడు సతీష్ మద్దతుగా నిలిచారు. ప్రభుత్వ స్థలాన్ని అద్దెకిచ్చిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేయాలని, తీసుకున్న అడ్వాన్స్‌ను తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు.



పట్టణంలోని ఏఎంఆర్ సినిమా హాల్ ఎదుట ధర్నా చేస్తున్న బాధితురాలు

విపత్తులపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

పినపాక: వర్షాకాలం దృష్ట్యా గోదావరి, వాగుల పరిసరాల్లోని ప్రజలకు ప్రకృతి విపత్తులపై అవగాహన ఉండాలని పినపాక తహసీల్దార్ గొంది గోపాల కృష్ణ సూచించారు. శుక్రవారం ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులతో కలిసి టి.కొత్తగూడెం గ్రామంలో అవగాహన కల్పించారు. వర్షాలు భారీగా కురిసి, వరదలు సంభవించిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను తెలియజేశారు. వరదల నుంచి బయటపడే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించిన సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: మండలంలోని మండలపల్లి గ్రామానికి కాంగ్రెస్ పార్టీ మండల యువనాయకుడు సాయిల నర్సీ తండ్రి వెంకటేశ్వరరావు గత కొద్దిరోజులుగా అనారోగ్యం సమస్యతో బాధపడుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మృతుడి భౌతిక కాయానికి నివాళులర్పించి, పూల మాల వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రావు జోగేశ్వరరావు, రావు గంగాధరరావు, పైడీ వెంకటేశ్వరరావు, చిన్నశెట్టి యుగంధర్, వాసం శ్రీను, పర్వతనేని ప్రసాద్, నాని, వీరయ్య పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను నమ్మొద్దు'



మాట్లాడుతున్న కొండా చరణ్

చర్ల: రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో చర్ల మండలంలోని గోదావరి నదీ తీర ప్రాంత గ్రామాలను ఏ మాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు స్థానిక సంస్థలు వస్తున్న తరుణంలో మాయమాటలు చెప్పేందుకు వస్తున్న బీఆర్ఎస్ నేతలను నమ్మవద్దని బీఎస్పీ పార్టీ చర్ల మండల అధ్యక్షుడు కొండా చరణ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా గోదావరి తీర ప్రాంతంలోని లింగాపురం, కొత్తపల్లి, గొంపల్లి, మొగ్గళ్లపల్లి, చింతకుంట, వీరాపురం తదితర గ్రామాల ప్రజలు ఈత వాగు వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈత వాగుపై వంతెన నిర్మాణం చేయాలని ఈ ప్రాంత ప్రజలు ఏళ్ల తరబడిగా కోరుతున్నప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదని అన్నారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షులు గోగికార్ రామలక్ష్మణ్, మండల కార్యదర్శి సామల ప్రవీణ మండల ఈసీ మెంబర్లు గుర్రాల విజయ్‌కుమార్, కొండా కౌశిక్, పంబీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారిని విస్తరించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సీసీ రోడ్డును విస్తరణ చేయాలని టీటీడీపీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఆస్పత్రికి వచ్చే అంబులెన్సులు, ఇతర అత్యవసర వాహనాలకు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతుందని పేర్కొన్నారు. వెంటనే సీసీ రోడ్డును విస్తరించి, వెడల్పు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాళ్లూరి చిట్టిబాబు, కొడాలి శ్రీనివాస్, కుంచాల రాజారాం,పళ్లింటి దేశప్ప, అభినేని శ్రీనివాసరావు, చంటి, రేపాక రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

3న శ్రావణ మాసోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టనంలోని రాజీవ్‌నగర్ మనుబోతుల చెరువు కాలనీలోని ముత్యాలమ్మ ఆలయంలో ఈ నెల 3న శావణమాసం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలును నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవార్ల రూపాలైన గరిగలకు ప్రత్యేక అలంకరణ చేసి పూజ కార్యక్రమాలతో పాటు ఊరేగింపు కార్యక్రమాన్ని అత్యంత వైభంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్య అనుగ్రహం పొందాలని కోరారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: మండలంలోని పెద్ద బండిరేవు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యలమంచి వంశీకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దబండిరేవు గ్రామంలో గ్రామ సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో కొత్తగా కట్టిన వాటర్ ట్యాంకు మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వాలని, పంచాయతీ అధికారులు రోడ్డు పక్కన ఉన్న చెట్లు, పొదలను తొలగించి.. వీధిలైట్లు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు సోయం వీర్రాజు, శాఖ కార్యదర్శి పాయం హరిబాబు, రాము, కనకారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన సీపీఐ నాయకులు

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట మున్సిపాలిటీ కమిషనర్ నాగరాజును సీపీఐ నాయకులు శుక్రవారం కార్యాలయంలో కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కొత్తగా ఏర్పాటైనా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు సమస్యలను వివరించి, వాటిని పరిష్కరించి అభివృద్ధిపై దృష్టి సారించాలని వినతి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎస్‌డి.సలీం, గన్నిన రామకృష్ణ, నూకవరపు విజయకాంత్, ఎస్‌డి.రజ్వీ, చీపూర్ల సత్యవతి, సూర్య కుమారి, షేక్ రసూల్ పాల్గొన్నారు.

పాడి రైతులకు అవగాహన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్

దుమ్ముగూడెం: మండలంలోని నర్సాపురం రైతు వేదికలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమరో ఆకాంక్ష మేళ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తెల్లం సీతమ్మ హాజరయ్యారు. అధికారులు ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మేక పాలు వినియోగం, లాభాలు, బాతుల పెంపకం, కౌజు పిట్టల పెంపకం, దేశీ కోళ్ల పెంపకం తదితర అంశాలపై క్లుప్తంగా వివరించారు. పశువుల దాణాగా అజోల వినియోగం, వివిధ రకాల మొక్కలు, చెట్ల వినియోగంపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, దుమ్ముగూడెం, చర్ల మండలాల పశువైద్య డాక్టర్ లిఖిత, డాక్టర్ సుధారాణి, సిబ్బంది రమేష్, సురేష్‌కుమార్, రవికుమార్, జగదీష్, నాగరాజు, చంద్రశేఖర్, పాడి రైతులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పర్యటన



రైతులకు యూరియా బస్తాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు

దుమ్ముగూడెం: మండలంలోని పలు గ్రామాలలో భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శుక్రవారం పర్యటించారు. నరసాపురం గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో యూరియా స్టాక్ పాయింట్ ప్రారంభించారు. అనంతరం తాలిపేరు ఆయకట్టు రైతుల సమక్షంలో కాలువ పూడికకు ఖర్చు ఎస్టిమేట్ తయారు చేయమని ఇరిగేషన్ డీఈ, ఏఈలకు సూచించారు. అనంతరం ఈ మధ్య కాలంలో రేగుబల్లి, లక్ష్మీనగరం, దుమ్ముగూడెం క్రాస్ రోడ్డు గ్రామాల్లో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో భద్రాచలం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మాజీ జెడ్పీటీసీ అన్నే సత్యనారాయణమూర్తి, కాంగ్రెస్ మండల నాయకులు లంక శ్రీనివాసరావు, తోట రమేష్, మోతుకూరి శ్రీకాంత్, కొండపల్లి నరేంద్ర, బొల్లి శేఖర్, పోడియం సుబ్బారావు, జెట్టి రామకృష్ణ, అల్లాడి వెంకటేష్, అయ్యప్ప రెడ్డి శ్రీధర్, పాయం వెంకటేశ్వర్లు, పిట్ట పూర్ణయ్య, పుట్టి అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించాలి

దమ్మపేట: మానవాళి ఆరోగ్యం, మనుగడకు ప్రకృతి ఒడిలో పచ్చదనాన్ని పెంపొందించాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని గండుగులపల్లి గ్రామంలో అశ్వారావుపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జారే పాల్గొన్నారు. అధికారులు ఎమ్మెల్యే చేతుల మీదుగా మొక్కలు నాటించి, నీరు పోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భవిష్యత్తు తరాల వారి మనుగడ కోసం మొక్కలను నాటి, అడవులను సంరక్షించుకోవాలని సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ..



అన్నపురెడ్డిపల్లి: లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): ప్రజాపాలనలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. అన్నపురెడ్డిపల్లిలోని రైతువేదికలు శుక్రవారం పలువురికి మంజూరైన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్లకాలంలో ఒక్కరికీ రేషన్‌కార్డు మంజూరు చేయలేదన్నారు. తహసీల్దార్ పుల్లారావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు వనమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, భీమిరెడ్డి వెంకట్రామిరెడ్డి, దుబాకుల రాము పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్

మణుగూరుటౌన్: మున్సిపాలిటీలోని పైలట్‌కాలనీ గ్రామంలో పల్లె దవాఖానాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ క్యాంప్‌ను శుక్రవారం నిర్వహించారు. ఈ క్యాంప్‌లో 45 మందికి ఎక్స్‌రే తీసి, అనుమానితుల నుంచి 45 మంది నుంచి కళ్ల పరీక్షలకు శాంపిళ్లను తీసుకున్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, రాంప్రసాద్, కుమారి, ప్రేమ్, ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

యూరియా అందించాలి

అశ్వారావుపేటరూరల్: ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు సకాలంలో యూరియా, డీఏపీ కొరత లేకుండా చేసి సకాలంలో అందించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోగినపల్లి ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం అశ్వారావుపేటలోని తహసీల్దార్, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట అఖిల భారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు నేపథ్యంలో ధర్నా నిర్వహించి.. అధికారులకు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరానికి కనీసం నాలుగు బస్తాలు అయినా అందించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు గొంది లక్ష్మణ్‌రావు, వాసం బుచ్చిరాజు, బాడిస లక్ష్మణరావు, కంగాల వెంకటేష్, పండా ముత్యాలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై పీవీఎన్ రావు

కరకగూడెం: నేటి ఆధునిక ప్రపంచంలో ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కరకగూడెం ఎస్సై పీవీఎస్.రావు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కలవలనాగారం గ్రామంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం, కొత్త చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. తెలియని నంబర్ల నుంచి వచ్చే ఓటీపీలు, లింకులను క్లిక్ చేయవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, కుటుంబాలకు జరిగే నష్టం గురించి వివరించారు. సైబర్ నేరాలకు గురైనా, డ్రగ్స్ విక్రయం, వినియోగం తారసపడినా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీ వర్గీకరణపై నిరసన



నిరసనలో పాల్గొన్న నాయకులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అమలులో విద్యార్థులకు అడ్మిషన్లు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తీవ్ర నష్టం జరుగుతుందని ఆరోపించారు. మాలలున్న మూడో గ్రూపులో రోస్టర్ పాయింట్లు ఎక్కువ చేయడంతో నష్టం చేకూరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అల్లాడి పౌల్ రాజ్, వీరబాబాఉ, రాజారత్నం, కిరణ్, అనిల్‌కుమార్, కార్తీక్, శివ, రమేష్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



అశ్వారావుపేటరూరల్: సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి, వినాయకపురం, నారాయణపురం, మామిళ్లవారిగూడెం, తిరుమలకుంట, గుమ్మడవల్లి, గుర్రాల చెరువుతోపాటు అశ్వారావుపేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయం, డ్రైవర్స్ కాలనీలో శ్రీ కనకదుర్గమ్మ ఆలయాల్లో శ్రావణ మాస రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయాల్లో అమ్మవార్లు, దేవతామూర్తులను అందంగా అలంకరించి, 108మంది మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవార్లకు అభిషేకాలు చేసి నైవేద్యాలు సమర్పించారు. లలిత పారాయణం, దుర్గా సూక్తిను పఠించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.